


సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా



శుక్రవారం ౹ 8 ౹ మార్చి ౹ 2024

మహిళలే మహారాణులు



- అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం వైఎస్ జగన్
- ఇంటి పట్టాలు మొదలు సంక్షేమ పథకాల్లోనూ పెద్దపీట
- గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ పరంగానూ అండ
- 50 శాతం నామినేటేడ్ పదవులతో పాటు నామినేషన్ పనులూ వారికే
- సోదరుడిలా, పెద్దకొడుకులా అండగా నిలిచారంటున్న మహిళలు

మహిళలు ఆర్థికంగా బాగుంటేనే కుటుంబాలు బాగుపడతాయని బలంగా నమ్మిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గత టీడీపీ ప్రభుత్వం మహిళలను అన్ని విధాలా మోసం చేసినా ... నేనున్నానంటూ వారికి అన్ని విధాలా భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలు మొదలు చట్టసభల దాకా... దిశ చట్టం మొదలు ఉద్యోగాల దాకా ఏ రంగంలోనైనా సరే మహిళలకు అగ్రతాంబూలం వేశారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అనేక పథకాలతో మహిళలకు పెద్దపీట వేసింది. ఇంటి రిజిస్ట్రేషన్‌తో పాటు స్త్రీనిధి రుణాలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, మహిళా సంఘాలకు సున్నావడ్డీ రుణాలు, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం తదితర పథకాలతో వైఎస్ జగన్ అండగా నిలిచారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు నిలిచేలా అవకాశం కల్పించారు. అంతేకాదు చట్టసభలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు సమన్యాయం చేశారు. జిల్లాలో మంగమ్మకు ఎమ్మెల్సీ ఇచ్చారు. పెనుకొండ, హిందూపురం నియోజకవర్గ సమన్వయ కర్తలుగా ఉషశ్రీచరణ్, దీపిక ఉన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇంద్రజకు అవకాశం ఇచ్చారు. ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా లక్ష్మి కొనసాగుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీపీలుగా మహిళలకు అవకాశం ఇవ్వడం విశేషం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళలకు ఇంత పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించిన దాఖలాలు లేవు.

'జగనన్న తోడు' ఇలా..

- 2020 - 9,995 మందికి రూ.9.99 కోట్లు
- 2021 - 21,893 మందికి రూ.21.89 కోట్లు
- 2022 - 20,327 మందికి రూ.20 కోట్లు
- 2023 - 29,145 మందికి రూ.26.22 కోట్లు

చిరు వ్యాపారులకు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోపుడు బండ్లు, వీధి వ్యాపారులకు జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు రుణం ఇస్తారు. వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఏడాది పొడవునా విడతల వారీగా అప్పు చెల్లిస్తే సరిపోతుంది. తొలి ఏడాది అప్పు తీరిస్తే.. మరుసటి ఏడాది మరో రూ.10 వేల రుణం ప్రభుత్వమే ఇస్తుంది. చిన్న వ్యాపారులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'జగనన్న తోడు' తీసుకొచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.78.1 కోట్ల రుణాలు ఇచ్చారు.

వైఎస్సార్ 'చేయూత' నిస్తూ



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్ వర్గాలకు చెందిన 45 - 60 ఏళ్ల మధ్య మహిళలకు ప్రతి ఏటా రూ.18,750 ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. మహిళలను ఆర్థికంగా పైకి తేవాలనే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత పథకం తీసుకొచ్చారు. నాలుగు విడతల్లో అర్హులందరికీ రూ.75 వేల ఆర్థిక సాయం అందింది. ఇప్పటికే దాదాపుగా 800 కోట్లు జమ చేశారు.

జిల్లా వ్యాప్తంగా లబ్ధి వివరాలు

- 2020 - 1,05,311 మందికి రూ.197.46 కోట్లు
- 2021 - 93,161 మందికి రూ.174.67 కోట్లు
- 2022 - 1,11,189 మందికి రూ.208.48 కోట్లు
- 2023 - 1,22,826 మందికి రూ.230.30 కోట్లు

స్త్రీనిధి రుణం ఇలా..

- 2019 - 15,895 మందికి రూ.79.45 కోట్లు
- 2020 - 20,539 మందికి రూ.102.91 కోట్లు
- 2021 - 34,121 మందికి రూ.119.85 కోట్లు
- 2022 - 19,959 మందికి రూ.119.05 కోట్లు
- 2023 - 29,059 మందికి రూ.147.01 కోట్లు

రూ.568 కోట్ల స్త్రీనిధి రుణాలు

మహిళా సంఘాలకు స్త్రీనిధి బ్యాంకు ద్వారా ఒక్కో గ్రూపునకు రూ.5 లక్షల వరకు రుణాలు ఇస్తారు. మొత్తం వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఐదు విడతల్లో ఇప్పటి వరకు రూ.568.27 కోట్ల రుణాలు అందజేసి మహిళా గ్రూపులు ఆర్థికంగా బలపడేలా చేశారు.

సున్నా వడ్డీ రుణాలతో అండ



బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకూ రుణాలు ఇస్తారు. అందులో రూ.3 లక్షల వరకు వడ్డీ మాఫీ అవుతుంది. మిగతా వడ్డీ లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. మహిళలు వ్యాపార రంగాల్లో రాణించేందుకు పెట్టుబడి కోసం సున్నా వడ్డీ రుణాలను ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ.195.26 కోట్ల సాయం చేసింది.

రుణాలు ఇలా..

- 2020 - 24,911 గ్రూపులకు రూ.54.88 కోట్లు
- 2021 - 29,061 గ్రూపులకు రూ.48.92 కోట్లు
- 2022 - 30,957 గ్రూపులకు రూ.51.21 కోట్లు
- 2023 - 36,928 గ్రూపులకు రూ.40.25 కోట్లు

'ఆసరా' లబ్ధి ఇలా..

- 2020 - 23,288 గ్రూపులకు రూ.179.69 కోట్లు
- 2021 - 23,365 గ్రూపులకు రూ.181.47 కోట్లు
- 2023 - 23,340 గ్రూపులకు రూ.180.20 కోట్లు

'ఆసరా'తో ఆపద్బాంధవుడిగా..

2019 ఏప్రిల్ నాటికి మహిళా సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తామని సీఎం జగన్ మాట ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళ రుణాలను బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ 541.36 కోట్లు మాఫీ చేసింది. నాలుగు విడతలుగా రుణాన్ని మొత్తం మాఫీ చేయడంతో డ్వాక్రా సంఘాల్లోని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ సొమ్మే ఆధారం



నా భర్త, ఉన్న ఒక్క కుమారుడు మరణించడంతో ఒంటరిగానే జీవిస్తున్నాను. కూలి పనిచేసే శక్తి కూడా లేదు. దీంతో ఎలా బతకాలో కూడా తెలియక నిస్సహాయస్థితిలో ఉన్న నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వలంటీరే ఇంటి దగ్గరకు వచ్చి నాతో పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. ఎవరి సిఫారసు లేకుండానే నాకు వితంతు పింఛన్ మంజూరైంది. ప్రభుత్వం అందిస్తున్న రూ.3 వేల పింఛనే నాకు ఆదరవుగా మారింది. జగనన్నకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేను. మళ్లీ ఆయనకే నా మద్దతు.

– మంగల లక్ష్మమ్మ, బ్రహ్మేశ్వరంపల్లి, చిలమత్తూరు

జగనన్న అన్ని విధాలా అండగా ఉన్నారు



గతంలో పాఠశాల తెరుస్తున్నారంటే యూనిఫారం, పుస్తకాలు, కొనడానికి ఫీజులు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మఒడి పథకం పుణ్యమా అని ఆ బాధ తప్పింది. నా కుమారుడికి ఇప్పటిదాకా రూ.40 వేలు లబ్ధి జరిగింది. అలాగే చేయూత కింద నేను రూ.75 వేల లబ్ధి పొందాను. ఈ డబ్బును పాడి ఆవులను కొనుగోలు చేసి ఏ అప్పులు లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. జగనన్న చేసిన మేలును మరువలేము.

– లక్ష్మీనరసమ్మ, ఆర్.అనంతపురం, మడకశిర మండలం

రూ 1.43 లక్షల సాయం పొందాను



జగనన్న ప్రభుత్వం అధికారంలోని వచ్చినప్పటి నుంచి నేటి దాకా నా కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా రూ 1.43 లక్షలు లబ్ధి పొందాము. వైఎస్సార్ ఆసరా రూ 8,925, వైఎస్సార్ పంటల బీమా రూ 10,191, వైఎస్సార్ రైతు భరోసా రూ 34,500, వైఎస్సార్ సున్నా వడ్డీ 4,238, చేయూత కింద రూ 37,500, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ 47,250 సాయం అందించింది. ముఖ్యమంత్రి జగనన్న మేలు ఎప్పటికీ మరువం.

– పెద్దక్క, బూచెర్ల, రొద్దం మండలం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పుట్టపర్తి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బాటనీ, సివిక్స్, గణితం పేపర్–2ఏ పరీక్షలు జరిగాయి. 41 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 8,404 మంది హాజరు కావాల్సి ఉండగా 8,141 మంది హాజరైనట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1028 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 965 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మొత్తం 326 మంది గైర్హాజరు అయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఐఈఓ వెల్లడించారు.

అక్కచెల్లెమ్మలకు 'చేయూత'

- వైఎస్సార్ చేయూత నిధుల విడుదల
- జిల్లాలో 1,12,482 మందికి రూ.210.90 కోట్ల లబ్ధి
- మెగా చెక్కు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్: ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ ఫలాలను పక్కాగా అమలు చేస్తున్నారు. పేదింటి అక్కచెల్లెమ్మల భవిష్యత్తుగా అండగా నిలవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకం నిధులను విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం అనకాపల్లి జిల్లాలో బటన్ నొక్కి చేయూత నిధులు విడుదల చేయగా.. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. వరుసగా నాలుగో ఏడాది 1,12,482 మంది లబ్ధిదారులకు రూ.18,750 చొప్పున ఖాతాల్లో జమ చేశారు.

జిల్లాలో రూ.210.90 కోట్లు లబ్ధి

వైఎస్సార్ చేయూత పథకం కింద జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల్లోని 45 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసున్న మహిళలకు రూ.18,750 ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇందులో భాగంగా నాలుగో విడత కింద 1,12,482 మందికి నిధులు విడుదల చేశారు. ఇందులో ధర్మవరం నియోజకవర్గంలోని 17,192 మందికి రూ.52.24 కోట్లు, హిందూపురంలోని 17,137 మందికి రూ.32.13 కోట్లు, కదిరిలోని 17,912 మందికి రూ.33.59 కోట్లు, మడకశిరలోని 20,085 మందికి రూ.37.66 కోట్లు, పెనుకొండలో 18,327 మందికి రూ.34.36 కోట్లు, పుట్టపర్తిలో 15,440 మందికి రూ.28.95 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో 6,389 మందికి రూ.11.98 కోట్లు లబ్ధి చేకూరింది. మొత్తం సుమారు రూ.210.90 కోట్ల నిధులు విడుదల చేశారు.

ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మాట్లాడుతూ మహిళలు చేయూత డబ్బులో ప్రతి పైసానూ కుటుంబ సంక్షేమం కోసం వినియోగించాలన్నారు. నాలుగేళ్లకు గాను ఒక్కో మహిళకు రూ.75 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద పథకాలను అందించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, గ్రామ,వార్డు సచివాలయాల జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ వి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, డీపీఎం రామమోహన్, రమణప్ప, ఏపీఎం సుధామణి, రమాదేవి, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోలేము



వైఎస్సార్ చేయూత పథకం డబ్బుతోనే చిల్లర అంగడిని పెట్టుకున్నాను. నా కుటుంబానికి ఇప్పుడు అదే జీవనాధారంగా మారింది. కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఏర్పాటు చేసిన చిల్లర అంగడితో రోజూ కూలీ కంటే అధికంగా సంపాదిస్తున్నాను. వైఎస్సార్ చేయూతతో పాటు ఆసరా, అమ్మఒడి, పింఛన్ కానుక అందుతున్నాయి. సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– ప్యారీమా, పెదపల్లి

చిప్స్ వ్యాపారమే జీవనాధారం



రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు తోడుగా చేయూత పథకంలో వచ్చిన డబ్బుతో స్వంతంగా చిప్స్ తయారు చేసి అంగళ్లకు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. జీవనాధారంతో పాటు పిల్లల చదువుకు వచ్చిన డబ్బును వినియోగించుకుంటున్నాము. వైఎస్సార్ చేయూత పథకంతో పాటు అమ్మఒడి, ఆసరా, పింఛన్ కానుక ద్వారా ఐదేళ్లలో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. – మంజుల, కొత్తచెరువు

పాడిని అభివృద్ధి చేసుకున్నాం



జగనన్న ఇచ్చిన చేయూత పథకం డబ్బుతో పాడి ఆవును కొనుగోలు చేసి పాలవ్యాపారం మొదలు పెట్టాము. ప్రస్తుతం పాడి ఆవుల సంఖ్య పెంచుకుంటూ పోతూ అవే జీవనాధారంగా చేసుకున్నాము. ఇటీవలే నా బిడ్డకు పెళ్లి చేసి పంపాను. చేయూతతో పాటు పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోంది. జగనన్న అండగా ఉంటే అన్ని కుటుంబాల్లోనూ సంతోషాలు వెల్లివిరుస్తాయి.

– నాగలక్ష్మి, బీడుపల్లి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శంగా నిర్వహించేందుకు జిల్లాలోని అధికారులందరూ సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికలు–2024లో భాగంగా జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని జేసీ తెలిపారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట క్యూ నిర్వహణ, షెడ్ ఏర్పాటు, తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. వికలాంగులకు, వృద్ధులకు, పోలింగ్ స్టేషన్‌కు రాలేని వారికి ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి, ఫిర్యాదులకు, ఎన్నికల ఫలితాల కోసం, అభ్యర్థుల సమాచారం కోసం, ఎన్నికలకు సంబంధించి ఇతర సమాచారం కోసం ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ఎన్నికల కమిషన్ రూపొందించినట్లు జేసీ తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి సిటిజన్ విజిల్ యాప్ పని చేస్తుందన్నారు. దీని ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకట శివకుమార్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, నియోజక వర్గం అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎం పనితీరు పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలోకి వస్తారన్నారు. ప్రతి నిబంధననూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పారు. పూర్తి అవగాహన ఉన్న వారినే పోలింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజక వర్గానికి రూ.40 లక్షలు ఖర్చు చేసుకోవచ్చన్నారు. ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, భోజనాలకు రేట్‌చార్ట్ ఫిక్స్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి మైనుద్దీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన 'సత్యం శివం సుందరం'

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యార్థులు శివుని లీలలను వివరిస్తూ 'సత్యం శివం సుందరం' పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రశాంతి డ్యాన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చక్కటి నృత్య భంగిమలతో శివుని వైభవాన్ని చాటారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రశాంతి నిలయంలో శుక్రవారం రాత్రి అఖండ భజన నిర్వహించనున్నారు. శనివారం ఉదయం వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది.



సాంస్కృతిక కార్యక్రమంలోని ఓ ఘట్టం

న్యూస్‌రీల్

ఫోర్స్ సామగ్రిని పరిశీలించిన ఎస్పీ



ఫోర్స్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు ఉపయోగించే బందోబస్తు ఫోర్స్ సామగ్రిని పోలీస్ కార్యాలంలో ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఎన్నికల సమయంలో అనుకోకుండా జరిగే సంఘటనల్లో ఉపయోగించే హెల్మెట్ స్టోన్ గార్డ్స్, లాటీ, మెగా ఫోన్, లైట్లు, బాడీ ప్రొటెక్టర్ వంటి సామగ్రిని పరిశీలించి వాటిని ఏవిధంగా ఉపయోగించాలి అన్న విషయాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు రవికుమార్, వళి, చంద్రశేఖర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'పురం' మార్కెట్‌కు 23 వేల క్వింటాళ్ల చింతపండు



గురువారం మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చింతపండు విక్రయాలు జోరందుకున్నాయి. గురువారం ఏకంగా 23 వేల క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.9,500, సగటున రూ.11 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.8 వేలు, కనిష్టంగా రూ.4,500, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

జపనీస్ భాషపై శిక్షణ, ఉపాధి

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్‌ఏవీఐఎస్ హెచ్‌ఆర్ సంయుక్తంగా బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం చదువుతున్న విద్యార్థులకు జపనీస్ భాష నేర్పించి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు జపాన్ దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. గ్రాడ్యుయేట్, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఏఎన్ఎం , జీఎన్ఎం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులన్నారు. 20 సంవత్సరాల నుంచి 36 మధ్య వయస్సు ఉండాలన్నారు. ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని, వసతి, ఇతర సదుపాయలపై ప్రభుత్వం 50 శాతం భరిస్తుందన్నారు. జీతం రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకూ ఉంటుందన్నారు. జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి కావాల్సిన సదుపాయలు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్‌ఏవీఐఎస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందన్నారు. www. apssdc. in. home. onlineprogramregistration అన్న వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9398643930 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పరిగి: జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల (ఏపీఆర్ఎస్ఓఈ) కొడిగెనహళ్లిలో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, విద్యా సంస్థల కన్వీనర్ ఎస్వీ మురళీధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగానూ 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6, 7, 8వ తరగతుల్లో పాఠశాలలో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి (80 సీట్లకు) దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులన్నారు. ప్రవేశ పరీక్షల ద్వారా మెరిట్ ఆధారంగా ఆయా తరగతుల సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈనెల 31 లోపు www. https. aprs. apsfss. in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25న ఏపీఆర్ఎస్ క్యాట్ అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి రూ10 లక్షల ఆర్థికసాయం



కృతజ్ఞతలు తెలుపుతున్న హోంగార్డు నాగార్జున, కుటుంబసభ్యులు

కదిరి టౌన్: ఆరు నెలల క్రితం ముదిగుబ్బ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న కదిరి పట్టణానికి చెందిన హోంగార్డు నాగార్జున కుటుంబాన్ని సీఎం వైఎస్ జగన్ ఆదుకున్నారు. కొన్ని రోజుల క్రితం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న సీఎం వైఎస్‌జగన్‌ను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, సీఐ హేమంతకుమార్ కలసి నాగార్జున దుస్థితిని వివరించారు. స్పందించిన సీఎం వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలను మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో నాగార్జున కుటుంబసభ్యులు అందుకున్నారు. తమను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు నాగార్జున కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాహి పాహి పరమేశ్వరా!

సాంబశివ... శంభోశంకర శరణం
మే తవ చరణయుగం
శివాయ నమహోః నమహః..
ఓం నమ శివాయః

.... అంటూ స్మరించగానే సకల అభీష్టాలు నెరవేరుతాయని ప్రతీతి. శివలింగంపై కాసిన్ని నీళ్లు పోస్తే సంతోషించి సర్వైశ్వర్యాలను ప్రసాదిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. అంత గొప్ప విశిష్టత కలిగిన శివలింగం ఆవిర్భవించిన మాఘమాసం కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహాశివరాత్రి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచే ఉత్సవాలను నేత్ర పర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

- నేడు మహాశివరాత్రి ఉత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుకున్నాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ వెలసిన పరమశివుడుని కొలిస్తే సకల అభీష్టాలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. రెండు కొండల మధ్య, ఎంతో ఆహ్లాదకరకమైన వాతావరణంలో వెలసిన కాటికోటేశ్వర క్షేత్రం భక్తులు, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇక్కడ కొండపై వెలసిన అక్కదేవతలు, గదాగుండం (కోనేరు), కాశీ నుంచి తెచ్చి ప్రతిష్ఠించిన శివలింగం, నవగ్రహాలు ప్రత్యేక ఆకర్శణగా ఉంటాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చిల్లవారిపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో కాటికోటేశ్వర క్షేత్రంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయం ఎదుట అగ్నిగుండం ప్రవేశ ఘట్టం ప్రధానంగా నిలుస్తోంది. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా తరలి రానున్న భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. దాడితోట గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో అన్నదానం ఉంటుంది.



తాడిమర్రి: ఆలయంలోని శివలింగం

దక్షిణ భారతంలోనే అరుదైన క్షేత్రం

అమరాపురం: దక్షిణ భారతదేశంలోనే అరుదైన శైవ క్షేత్రంగా ఖ్యాతిగాంచినఅమరాపురం మండలంలోని హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం అఖండ పూజలు, రుద్రాభిషేకాలు, భజనలు ఉంటాయి. 9న భానుపల్లకి, ధూళోత్సవం, అన్నసంతర్పణ, 10న ఆదివారం అగ్నిగుండ ప్రవేశం, ముత్యాల పల్లకీ ఉత్సవం, సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ ఉంటుంది. 11న సాయంత్రం సిడిమాను ఉత్సవం, అన్నసంతర్పణ, రాత్రికి ముత్యాలపల్లకీ ఉత్సవం, 12న చిన్న రథోత్సవం, రాత్రి ముత్యాల పల్లకీ ఉత్సవం, 13న బ్రహ్మరథోత్సవం, అన్నసంతర్పణ, 14న వసంతోత్సవం, 15న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు హిందూపురం, మడకశిర, కళ్యాణదుర్గం నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అలాగే బెంగళూరు, తుమకూరు, మధుగిరి, శిర, హిరియూర్, అమరాపురం, లక్కనహళ్లి స్టేషన్ల నుంచి ప్రైవేట్ బస్సుల సంచారం ఉంటుంది. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసింది.



అమరాపురం: మానవాకారంలో కొలువుదీరిన సిద్ధేశ్వరస్వామి



లేపాక్షి: సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షిలో ప్రారంభమైన ఉత్సవాలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహాగణపతి, సుదర్శన హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి విశేష పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఆగమికులు సునీల్‌శర్మ, ఈఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేశాం



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి
- టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ధర్మవరం: గతంలో చంద్రబాబు టిడ్కో ఇళ్లను కమీషన్లకు కక్కుర్తి పడి పేదలపై నెలవారీ కంతులు మోపాలని చూస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని పేదలకు ఉచితంగా అందజేసి సొంతింటి కల సాకారం చేశారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కొనియాడారు. గురువారం ధర్మవరంలోని టిడ్కో అపార్ట్‌మెంట్‌ల వద్ద లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను పేదలకు అందించేందుకు నెలకు రూ.4 వేలు కంతులు చెల్లించాలని నిబంధన పెట్టారని గుర్తు చేశారు. తద్వారా కంపెనీతో పాటు తాను కూడా వాటాలు దండుకునేలా చంద్రబాబు కుట్ర చేశారన్నారు. ఇంటి అద్దెలు కట్టుకోవడమే గగనమౌతున్న తరుణంలో నెల వాయిదాలను పేదలు ఎలా చెల్లిస్తారని ఆలోచించిన సీఎం వైఎస్ జగన్... వారికి ఉచితంగా టిడ్కో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. మొత్తం రూ.75 కోట్లతో 30 బ్లాక్‌లను నిర్మిస్తున్నామని, ఇందులో 1,440మంది లబ్ధిదారులకు గానూ వెయ్యి మందికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. అపార్ట్‌మెంట్లలో ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి రూ.6.50 లక్షలు ఖర్చు పెట్టామన్నారు. స్థలంతో పాటు మార్కెట్‌లో ఒక్కో ఫ్లాట్ విలువ రూ.12.80 లక్షలు ఉంటుందన్నారు. ఇంత ఖరీదైన ఫ్లాట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించడం చరిత్రాత్మకమన్నారు. టిడ్కో అపార్ట్‌మెంట్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని, మరో నెల రోజుల్లోపు పేదలతో గృహ ప్రవేశాలు చేయిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ రామ్ కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, ఎర్రగుంట భాగ్యలక్ష్మి, గోరకాటి పురుషోత్తంరెడ్డి, నాయకులు రేగాటిపల్లి సురేష్‌రెడ్డి, కడప రంగస్వామి, దాసునాయక్, జేసీబీ రమణ, కేతా లోకేష్, అత్తార్ జిలాన్‌బాషా, మేడాపురం వెంకటేష్, ఉడుముల రాము, కాచర్ల అంజి, కృష్ణాపురం జమీర్ అహ్మద్, పెద్దిరెడ్డి శ్రీనివాసులు, మేడాపురం సూరి, మట్టిద్దుల కేశవరెడ్డి, సరితాల బాషా, కుమారస్వామి, తోపుదుర్తి వెంకట్రాముడు, కత్తె పెద్దన్న, సుభాన్, తీర్థాల రమణ, బాలంగోపాల్, పరంధామిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

నల్లమాడ: నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో మహిళ మృతికి కారణమైన కేసులో ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రతిమ తీర్పు వెలువరించారు. వివరాలను నల్లమాడ ఎస్‌ఐ జి.రమేష్‌బాబు గురువారం వెల్లడించారు. గత ఏడాది ఆగస్టు 8న అమడగూరుకు చెందిన వీరానిపల్లి నరసింహమూర్తి ఆటో నడుపుతూ నల్లమాడ మండలం పులగంపల్లి గ్రామం పూలబండ వద్దకు చేరుకోగానే ఎదురుగా గడ్డం అంజినమ్మ వెళుతున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసిన నల్లమాడ పోలీసులు పక్కా ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 15 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నరసింహమూర్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రతిమ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ లక్ష్మీసాయి రామ్ కృష్ణ వినిపించారు.

తిమ్మమ్మమర్రిమాను వద్ద జనజాగరణ



రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి రథాన్ని లాగి ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రథాన్ని తిమ్మమ్మమర్రిమాను, దిగువగూటిబైలు, ఎగువగూటిబైలు గ్రామాలో కోలాహలంగా ఊరేగించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మర్రిమాను వద్ద జాగరణ మహోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు లక్ష్మీకాంత్

మడకశిర రూరల్: మండలంలోని అయ్యవారిపల్లి బస్టాండులో గురువారం రాత్రి టాటా ఏస్ వాహనం ఢీకొని బి.రాయపురం గ్రామానికి చెందిన పూజారి లక్ష్మీకాంత్(51) దుర్మరణం పాలయ్యారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఆయనను హిందూపురం నుంచి మడకశిర వైపు వెళుతున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సీఎం జగన్‌తోనే గిరిజనులకు అధిక ప్రాధాన్యత

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ధర్మవరం రూరల్: రాజ్యాంగ పరంగా గిరిజనులకు అత్యున్నత పదవులు ఇచ్చి వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గురువారం సాయంత్రం ధర్మవరంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ హయాంలో గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవిని గిరిజనులకు కట్టబెట్టి సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. అలాగే టీటీడీ, శ్రీశైలం వంటి దేవస్థానాల పాలక మండలిలో చోటు కల్పించారన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడి అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్ పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. పేదల బతుకులు మారాలంటే రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, నాయకులు వడిత్యా రాందాసునాయక్, భాస్కర్ నాయక్, సోమ్లానాయక్, సుమతి భాస్కర్‌నాయక్, పవన్, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రంలో చిక్కుకుని మహిళ మృతి

తాడిమర్రి: వేరుశనగ నూర్పిడి యంత్రంలో చిక్కుకుని ఓ మహిళా కూలీ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం పెద్దకోట్ల కు చెందిన ఓ రైతుకు చిల్లకొండయ్యపల్లికి చెందిన కొంకా ప్రసాద్ తన వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని అద్దెకు పంపాడు. ఈ క్రమంలో యంత్రం వద్ద పనిచేసేందుకు చిల్లకొండయ్యపల్లికి చెందిన పులిమద్ది ఫకృద్దీన్ భార్య రమీజా (50) కూలికి వెళ్లింది. గురువారం సాయంత్రం 5 గంటలకు మిషన్‌లోకి వేరుశనగ కాయలు వేస్తుండగా రమీజా చీర కొంగు మోటారు బెల్ట్‌కు తగులుకుని లాక్కెళ్లింది. బెల్టుకు మెడ తగిలి శరీరం నుంచి తల తెగిపడింది. గమనించి కూలీలు వెంటనే మిషన్‌ను ఆఫ్ చేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వత్థ, జొల్లిరెడ్డి రామన్న... మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

హిందూపురం అర్బన్: స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ పలు చర్యలు తీసుకుంటున్నట్లు కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రేప్, అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. చేతి వృత్తులపై ఆధారపడిన గ్రామీణ ప్రాంత యువతకు కేవీఐసీ ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, కేంద్ర పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న హిందూపురం ప్రాంతానికి చెందిన 430 మందికి శుక్రవారం ఎంజీఎం మైదానంలో కిట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ మనోజ్‌కుమార్ హాజరవుతారన్నారు.

సృజనాత్మకతతోనే నైపుణ్యత పెంపు

అనంతపురం: సృజనాత్మకతతోనే నైపుణ్యత పెంపొందుతుందని ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాలఫెర్రర్ అన్నారు. ఆర్డీటీ కార్యాలయంలో గురువారం సెంట్రల్ లెవల్ క్విజ్ ఫెస్ట్-2024ను నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫెస్ట్‌కు విశేషంగా హాజరైన విద్యార్థులను చూసి ఆనందంగా ఉందన్నారు. క్విజ్ ఫెస్ట్‌లో మొదటి బహుమతి పొందిన ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన వి. లావణ్య, బి. నాని, జి.సుకుమార్, జి. నవ్యశ్రీను అభినందించారు. ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహనమురళీ పాల్గొన్నారు.

విద్యార్థి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని యర్రజిన్నన్నగారిపల్లిలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన మల్లేశ్వరి, బొగ్గు సిద్దప్ప దంపతులు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ఓ కుమారుడు అభిషేక్ (16) చెన్నేకొత్తపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అభిషేక్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి ఆలస్యంగా చేసుకున్న కుటుంబసభ్యులు గమనించి వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అభిషేక్ మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థికి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంతమ్మ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.